కాసులివ్వకపోతే .. కొర్రీలే!



తాండూరు విద్యుత్ సబ్‌డివిజన్‌లో లంచావతారాలు

ఒక్కో పనికి ఒక్కో రేటు..

డీడీలు కట్టినా తప్పని వేధింపులు

ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్‌కు రూ.35 వేలు డిమాండ్

ఎమ్మెల్యే సోదరుడిని ఆశ్రయించిన బాధిత రైతు

వారంలోగా పరిష్కరించాలన్న ఆదేశంతో దిగివచ్చిన సిబ్బంది

ప్రభాతవార్త, ప్రభాతవార్త-వికారాబాద్ జిల్లా ప్రతినిధి: కొత్త విద్యుత్ లైన్లు, మీటర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు తాండూరు విద్యుత్ శాఖ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. అడిగినంత ఇచ్చేందుకు నిరాకరించిన వారికీ కొర్రీలు పెట్టి రోజుల తరబడి పనులు పెండింగ్ లో పెడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం రైతు భరోసాకు ప్రాధాన్యం ఇస్తున్నా, ఈ సంస్థ ఉద్యోగులు మాత్రం నిరక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారు. అసలే అది కరువు కాలం.. కష్టాల్లో మునిగిన రైతన్నలకు విద్యుత్ సంస్థ ఉద్యోగు తీరు తీవ్ర అసహనాన్ని తెప్పిస్తోంది. తాండూరు సబ్‌డివిజన్‌లో వేళ్లూనుకున్న కొంతమంది స్థానిక అధికారులు, ఉద్యోగుల కారణంగానే ఇంత దారుణ పరిస్థితి ఎదురవుతోందని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

తాండూరు పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి ప్రాంత రైతులు తమ పొలాల వద్ద ట్రాన్స్ఫార్మర్ షిఫ్టింగ్ కోసం విద్యుత్ కార్యాలయంలో అర్జీలు పెట్టుకున్నారు. తరచూ సరఫరాలో సాంకేతిక సమస్యలు రావడం వల్ల, ప్రతీసారి తమకు నాలుగైదు వేల రూపాయల అదనపు భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సూచన మేరకు వారు సకాలంలో డీడీలు కూడా కట్టారు. కానీ నెలలు గడుస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. తీరా నిలదీస్తే.. ఆ పనులు చేసేందుకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని, కాంట్రాక్టరుకు, ఉన్నతాధికారులకు కప్పం(లంచం) కట్టాల్సి వస్తుందని కిందిస్థాయి ఉద్యోగి ఒకరు రైతులకు తెగేసి చెప్పారు. ట్రాన్స్ఫార్మర్ షిఫ్టింగ్ చేయాలంటే రూ. 35 వేల వరకు ఇచ్చుకోవాల్సిందేనని సిబ్బంది డిమాండ్ చేయడంతో రైతులు వాపోయారు. ఈ అవినీతి వ్యవహారంపై విసిగిపోయిన మల్‌రెడ్డిపల్లి రైతులు స్థానిక ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి సోదరుడు బి. శ్రీనివాస్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన, తక్షణమే సంబంధిత విద్యుత్ అధికారులకు, సిబ్బందికి ఫోన్ చేసి రైతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని >>2

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

రాజ్‌కుమార్ మృతదేహాన్ని చేవెళ్ల అసుపత్రికి పోస్టు మార్టం కోసం తీసుకువెళ్తున్న దృశ్యం



పాపం పండింది!

చట్టం కంటే ముందే దేవుడే శిక్షించాడు

సైకో కిల్లర్ రాజ్‌కుమార్ ఆత్మహత్యపై సర్వత్రా హర్షం

చేవెళ్ల/షాద్‌నగర్, జులై 13, ప్రభాతవార్త : ఆరుగురు అమాయకులను పొట్టనబెట్టుకున్న ఆ నరహంతకుడికి దేవుడే సరైన శిక్ష వేశాడు.. "వాడు చేసిన పాపమే వాడిని వెంటాడి చంపేసింది" అంటూ దైవలగూడ, పెంజర్ల గ్రామాలతోపాటు.. సర్వత్రా తీవ్ర ఆగ్రహం, ఉపశమనం వ్యక్తం చేస్తున్నారు. 29 సంవత్సరాల రాజ్‌కుమార్ మైనర్ బాలికను, ఆమె తల్లిని, నాయనమ్మను దారుణంగా హతమార్చడమే కాకుండా తాళి కట్టిన ఇల్లాలిని, కడుపున పుట్టిన పిల్లలు ఇద్దరిని కూడా కడతేర్చిన ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. పోలీసుల వేట తీవ్రమవ్వడం, తప్పించుకునే దారి లేకపోవడంతో కొత్తూరు మండలం పెంజర్ల శివారులోని ఒక వెంచర్‌లో రాజ్‌కుమార్ పురుగుల మందు తాగి శవమై పడి ఉన్నాడన్న వార్త తెలియగానే పరిసర గ్రామాలతోపాటు జిల్లా వాసుల ఆగ్రహావేశాలు ఒక్కసారిగా చల్లారాయి.

"రాజ్‌కుమార్ మనిషి కాదు, రాక్షసుడు. పాలుగారే పసిపిల్లలు అని కూడా చూడకుండా గొంతు కోసి చంపినప్పుడే ఆ దుర్మార్గుడి ఆయువు తీరిపోయింది. కోర్టులు, జైళ్లు అయితే ఏళ్ల తరబడి విచారణ జరిగేదేమో.. కానీ విధి వెంటనే తీర్పు చెప్పింది. మానవ మృగం చేసిన పాపం పండి, పోలీసుల భయంతో దిక్కులేని మరణం పొందాడు" అంటూ స్థానికంగా చర్చించుకున్నారు.

పోలీసుల వేటతో చావు భయం రుచి తెలిసొచ్చింది

అంతమందిని దారుణంగా చంపుతుంటే రాని భయం, పోలీసులు 14 బృందాలుగా విడిపోయి రూ.2 లక్షల రివార్డు ప్రకటించి వేట మొదలుపెట్టేసరికి ఆ ఉన్మాదికి చావు భయం రుచి తెలిసొచ్చింది. తిండి, తిప్పలు లేక, తలదాచుకోవడానికి చోటు దొరకక, రైల్వే ట్రాక్ ఎక్కి రైలు కింద పడదామన్నా ధైర్యం చాలక.. చివరకు పురుగుల మందు తాగి కుక్క చావు చచ్చాడని స్థానికులు ఛీత్కరించుకుంటున్నారు.

సెల్ఫీ వీడియో డ్రామాలు నమ్మం

చనిపోయే ముందు రాజ్‌కుమార్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లని, అప్పులని, ఒక అమ్మాయి నమ్మించి మోసం చేసిందని పెట్టిన సెల్ఫీ వీడియోలపై గ్రామస్తులు తీవ్రంగా మండిపడుతున్నారు."తప్పులన్నీ ఆ ఉన్మాది చేసి, ఆరుగురిని నరికి చంపి, ఇప్పుడు చనిపోయేటప్పుడు సానుభూతి కోసం డ్రామాలు ఆడుతున్నాడు. పోక్సో కేసు పెట్టిన పగతో మైనర్ బాలికను, అడ్డువచ్చిన పెద్దవాళ్లను చంపడం కాక.. తనను నమ్ముకున్న భార్యాపిల్లలను చంపడానికి బెట్టింగ్ అప్పులకి ఏం సంబంధం? ఆ కామాంధుడు పక్కా సైకో" అంటూ మండిపడుతున్నారు.

ఇది ఆ దేవుడి తీర్పే

నరహంతకుడు రాజ్‌కుమార్ చనిపోవడంతో ఒక పెద్ద పీడ వదిలిందని ఊపిరి పీల్చుకున్నప్పటికీ, గ్రామంలో మాత్రం ఇంకా ఆరుగురి నిండు ప్రాణాలను దారుణంగా చిదిమేసిన ఆ నిశ్శబ్దం, భయం వదల్లేదు."రాజ్‌కుమార్ చావడం వల్ల కేసు ముగిసిపోవచ్చు.. కానీ ఆ ఆరుగురు అమాయకులు మళ్లీ తిరిగి రావు కదా" అని పెద్దలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఒకవేళ పోలీసులు ముందే స్పందించి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదని, ఇప్పటికైనా ఆ ఆత్మ ఆత్మహత్య రూపంలో అంతమవ్వడం ఒక రకంగా ఆ దేవుడు ఇచ్చిన తీర్పేనని నమ్ముతున్నామని పలువురు పేర్కొన్నారు. ఆరుగురి రక్తం తాగిన ఆ నరహంతకుడికి, సమాజంలో బతికే అర్హత లేదనే వాడి కథ ముగిసేలా విధి ప్రేరేపించిందని వ్యాఖ్యానించారు.

చిత్రహింసలు పెట్టి చంపాల్సింది..

సమాజంలో మాకు సుఖం లేకుండా చేశాడు

రాజ్‌కుమార్ సోదరుడు భాస్కర్ ఆవేదన

షాబాద్: ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితుడు రాజ్‌కుమార్ చర్యలను అతని సోదరుడు భాస్కర్ తీవ్రంగా పరిగణించారు. రాజ్‌కుమార్ చేసిన దారుణం వల్ల తమ కుటుంబం సమాజంలో తలెత్తుకుని తిరగలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశా రు. ఆరుగురిని గొంతు కోసి చంపిన వాడిని అలాగే చిత్రహింసలు పెట్టి చంపాల్సింది. ప్రశాంతంగా చనిపోయి ఎన్నో కుటుంబాల మనశ్శాంతిని హరించాడు. ఇంత దుర్మార్గుడు మా తమ్ముడు అవుతాడని ఎన్నడూ ఊహించలేదు. వాడి వల్ల మాకు సమాజంలో సుఖం లేకుండా పోయింది. బతికుండగానే కాల్చి చంపాల్సింది. అని భాస్కర్ భావో ద్వేగంతో అన్నారు. రాజ్‌కుమార్ చేసిన అమానుష చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని అన్నారు.

మా అమ్మాయి జీవితం సర్వనాశనం చేశాడు

రాజ్‌కుమార్ అత్త జయమ్మ ఆవేదన

"దుర్మార్గుడు నా అమ్మాయి జీవితాన్ని సర్వనాశనం చేశాడు. ప్రేమ పేరుతో వేధించి, మరో పెళ్లి సంబంధం చూసే పరిస్థితిని కూడా లేకుండా చేశాడు. చివరకు అత్యంత దారుణంగా హత్య చేసి మా కుటుంబాన్ని తీరని విషాదంలో ముంచేశాడు" అని హత్యకు >>2

నిరసన తెలుపుతున్న సిద్దాపూర్ పరిసర గ్రామాల ప్రజలు

ప్రాణాలైనా ఇస్తాం... ఒప్పుకోం!

డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా హైవేపై ప్రజాగర్జన

కొత్తూరు, జులై 13, ప్రభాతవార్త : కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డు, జీవో 641కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం మరింత ఉధృతమైంది. ప్రాణాలు పోయినా పర్వాలేదు.. జీవో 641 రద్దయ్యే వరకు పోరాటం ఆగదు అంటూ సిద్దాపూర్, పెంజర్ల, కొత్తూరు పరిసర గ్రామాల ప్రజలు వేలాదిగా రోడ్లపైకి వచ్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆర్‌డీఓ, ఎమ్మార్వో కార్యాలయాలకు భారీ ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేయాలని ఉద్యమకారులు ప్రయత్నించగా, పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం జాతీయ రహదారి-44పై పెద్దఎత్తున నిరసన చేపట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని పక్కనపెట్టి జీవో 641ను అమలు చేయాలని ప్రయత్నిస్తోందని ఉద్యమకారులు మండిపడ్డారు. అక్రమ అరెస్టులు, పోలీసు నిర్బంధాలు, బెదిరింపులతో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింత ఉధృతంగా పోరాడతామని హెచ్చరించారు. >>2

బతికుండగానే రికార్డుల్లో మరణం!

✦46 నెలలుగా వృద్ధుడి పెన్షన్ నిలిపివేత ✦ధారూర్ మండల అధికారుల నిర్వాకం.. ✦కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందించని అధికారులు.. ✦నిలదీయడంతో వెలుగుచూసిన దారుణం

ధారూర్, జులై 13, ప్రభాతవార్త: బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులే ఓ వృద్ధుడి విషయంలో అత్యంత దారుణంగా వ్యవహరించారు. బతికున్న మనిషిని రికార్డుల్లో చనిపోయినట్లుగా నమోదు చేసి, ఆయనకు అందాల్సిన పెన్షన్ను నిలిపివేసిన ఘటన ధారూర్ మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించిన వివరాలలోకి వెళితే.. ధారూర్ మండల పరిధిలోని ధారూర్ స్టేషన్ గ్రామానికి చెందిన అబ్దుల్ మోయిజ్ అనే వృద్ధుడికి 2022 ఆగస్టు వరకు పెన్షన్ సక్రమంగానే అందింది.

పెన్షన్ రావటం లేదని అడగటానికి వెళితే...నిర్లక్ష్యం సమాధానం

ఆ తర్వాత ఒక్కసారిగా పెన్షన్ ఆగిపోవడంతో, అసలు విషయం తెలుసుకోవటానికి ఆయన, ఆయన కుమారుడు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. అయితే, అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోకుండా, ఈరోజు రా.. రేపు రా అంటూ వారిని తిప్పించుకున్నారే తప్ప, సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయలేదు.

2022లోనే చనిపోయినట్లు నమోదు

తండ్రి ఆరోగ్యం సహకరించకపోయినా, తన తండ్రి పెన్షన్ కోసం కొడుకు పడ్డ కష్టం అంతా ఇంతా కాదు. చివరికి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో గట్టిగా నిలదీయడంతో, అధికారులు పెన్షన్ లాగిన్‌ను తనిఖీ చేశారు. అందులో అబ్దుల్ మోయిజ్ 2022లోనే చనిపోయినట్లు నమోదు చేసినట్లు తేలింది. తన తండ్రి కళ్ల ముందు సజీవంగా ఉండగానే, చనిపోయినట్లుగా రికార్డులు సృష్టించడం చూసి ఆయన కుమారుడు

ధారూర్ ఎంపిడివో ఆఫీసు. (ఇన్‌సెట్) బాధితుడు అబ్దుల్ మోయిజ్

దిగ్భ్రాంతికి గురయ్యారు.

వృద్ధుడి మానసిక వేదనకు బాధులెవరు?: గ్రామస్తుల ఆగ్రహం

బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు నమోదు చేయడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా పెన్షన్ అందక వృద్ధుడు పడ్డ ఇబ్బందులకు, మానసిక వేదనకు బాధ్యులెవరని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన లోపం వల్లే ఇలాంటి అమానవీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి, జరిగిన తప్పు ను సరిదిద్ది, బాధితుడికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఎంపీడీవో నర్సింలును వివరణ కోరగా.. ఈ ఘటనపై తాను పరిశీలన జరుపుతానని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నుంచి నివేదిక తెప్పించుకుని, బాధితుడికి మళ్ళీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పరిగి పోలీసు స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పి స్నేహ మెహ్రా

సంఘ విద్రోహ శక్తులపై నిఘా

ఎస్పి స్నేహ మెహ్రా

పరిగి జులై 13 ప్రభాతవార్త : ప్రజల నుండి వచే ఫిర్యాదులకు చట్టబద్ధంగా విచారణ చేపట్టాలని, విచారణలో జాప్యం లేకుండా సకాలంలో న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలని వికారాబాద్ జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా, పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. సోమవారం వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా, ఐపిఎస్ పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.. వివిధ విభాగాలలో పోలీసుల పనితీరు పై ఎస్పి ఆరా తీసారు. పోలీస్ స్టేషన్ లోని రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.. సిసిటిఎన్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది, విధుల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతి ఫిర్యాదును స్వీకరించి, చట్టబద్ధంగా విచారణ పూర్తి చేయాలని, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా >>2

వీధి దీపాల మాటున చీకటి దందా?

ఒక బల్బు ధర రూ.1416

దామర్‌చెడ్ పంచాయతీలో ఆరోపణల కలకలం

ప్రజాధనం దుర్వినియోగంపై ఎంపిడివోకు ఫిర్యాదు

క్షేత్రస్థాయి దర్యాప్తు చేయాలని డిమాండ్

బషీరాబాద్, జులై 13, ప్రభాతవార్త : కర్ణాటక సరిహద్దున గల బషీరాబాద్ మండలాన్ని అక్రమార్కులు అడ్డాగా మార్చుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు పక్కదారి పట్టడం ఈ మండలంలో సర్వ సాధారణంగా మారింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే ఘనులకూ ఇక్కడ కొదవ లేదు. ఉన్నతాధికారుల విచారణ తూతూమంత్రంగా ఉండటం వల్ల దశాబ్దాలుగా ఇక్కడ అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది తాజాగా ఇదే మండలంలోని దామర్‌చేడ్ గ్రామంలో వీధి దీపాల ఏర్పాటులో అక్రమాలు జరిగినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెలగని వీధి దీపాలను తొలగించి కొత్త బల్బులను ఏర్పాటు చేశారు. ఈ పనుల్లో అక్రమాలు జరిగినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కొన్ని బల్బులు అమర్చకుండానే బిల్లులు కాజేశారని కూడా ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ నిధుల కింద 118 బల్బులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 80 బల్బులను మాత్రమే అమర్చి ఎంబీ రికార్డులు చేశారు. దీనికి సంబంధించి రూ.1.13 లక్షలు బిల్లులు డ్రా చేశారు. ఈ లెక్కన అమర్చిన ఒక్కింటి బల్బు ధర రూ.1416 కావడం గమనార్హం. దీనిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఈ నమూనా బల్బు ధర అంత భారీ స్థాయిలో ఉండదని పలువురు ఎలక్ట్రికల్ దుకాణ యజమానులు చెబుతున్నారు. దీనిపై గ్రామస్తులు తాండూరు పట్టణంలోని పలు దుకాణాలకు వెళ్లి ధరలపై ఆరా తీశారు. విద్యుత్ దీపాల వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు అనుమానం వ్యక్తం

చేశారు. పంచాయతీ వార్డు సభ్యురాలు అనురాధ మాట్లాడుతూ సర్పంచ్ భారతి ఏకపక్షంగా వ్యవహరిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వార్డు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారని తెలిపారు. వీధి దీపాల మాటున అక్రమంగా బిల్లులు పొందారని ఆమె ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లోనూ అక్రమంగా బిల్లులు చేసుకున్న విషయంపై 2026 మార్చి 26న ఎంపీడీవోకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినా ఎలాంటి విచారణ చేపట్టలేదని తెలిపారు. అక్రమ బిల్లుల వ్యవహారంపై ఏఈ, పంచాయతీ కార్యదర్శి పాత్ర ఉండవచ్చని ఆరోపించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బల్బుల సంఖ్య, వాటికి సంబంధించిన బిల్లులు, నిధుల వినియోగంపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని గ్రామస్తుడు ఎర్రబాబు డిమాండ్ చేశారు. ఎంబి రికార్డులపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోపణలు నిరాధారం : సర్పంచ్

బల్బుల అమర్చడంలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలు నిరాధారమని సర్పంచ్ భారతి తెలిపారు. >>2

సబ్ స్టేషన్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి జులై 13 ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి అవసరం ఉన్నచోట విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మర్పల్లి మండలంలోని పట్లూర్ గ్రామంలో పోమవారం నాడు 3.4కోట్ల రూపాయలతో నిర్మించనున్న సబ్ స్టేషన్‌కు ఆయన శంకుస్థాపపన చేశారు. మర్పల్లిలో 25లక్షలతో నిర్మించిన ప్రాథవిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని, ఇందిరమ్మ ఇంటిని ప్రారంబించారు. దంపతులకు నూతన వస్త్రాలు బహుకరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో లెలకొన్న లో ఓల్ట్ సమస్య నివారణ కోసం అవసరం ఉన్న చోట సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి చీకటిలో వెలుతురు నింపడానికి, నిరంతరం మెరుగైన విద్యుత్‌ను అందివ్వడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిదంగా ఎప్పుడూ మందులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన బిపి చెక్ చేసుకున్నారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈకార్యక్రమంలో విద్యుత్ డీఈ, సంజీవ, డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, పట్లూర్ మర్పల్లి సర్పంయ్‌లు బనావత్ పరశరాం, రామేశ్వర్, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఎంపీడీఒ , పలువురు అధికారులు జిల్లా ఉపాధ్యక్షులు రవెంధర్, పార్టీ అధ్యక్షులు సురేష్‌యాదవ్, సుభాష్ యాదవ్‌సీనిర్ నాయకులు రాములుయాదవ్, దివాకర్, నాగేష్,ంాములు, రవెంధర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

జవాబుదారీతనంతో పనిచేయండి

కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డిఅర్బన్, జులై 13,ప్రభాతవార్త: ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీకృత ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు వివరించి వినతిపత్రాలు సమర్పించారు. భూ వివాదాలు,పట్టాదారు పాస్‌పుస్తకాలు, భూ రికార్డుల సవరణలు, సంక్షేమ >>2

పాపం పండింది

(మొదటి పేజీ తరువాయి)

గురైన సరిత తల్లి కప్పెర జయమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె మాట్లాడుతూ, తమ కుటుంబానికి తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పసిపిల్లలను సైతం గొంతు కోసి హత్య చేసిన నిందితుడికి అత్యంత కఠిన శిక్ష విధించాలని, ప్రజల సమక్షంలో శిక్షి ంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణ ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి న్యాయం చేయాలని జయమ్మ విజ్ఞప్తి చేశారు.

మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి..

షాబాద్‌లో చోటుచేసుకున్న ఆరు హత్యల కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసుల దర్యాప్తులో పలు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విడాకులు ఇవ్వమని అడిగిందన్న కారణంతోనే నిందితుడు రాజ్‌కుమార్ తన భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేశాడని సమాచారం. తన విచ్చలవిడి జీవితానికి అడ్డువస్తుందనే కారణంతో ఆమెను అడ్డు తొలగించుకునేందుకు ముందు నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజ్‌కుమార్, సరిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. రాజ్‌కుమార్ ఇంటర్మీడియట్ చదివే సమయంలో సరిత దగ్గరకు ట్యూషన్ చెప్పించుకోవడానికి వెళ్లాడు. ప్రేమ పేరుతో ఆమెను వేధించటం మొదలెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న సరిత తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూడ్డం మొదలెట్టారు. సరితను పెళ్లి చేసుకోవాలన్న ఉద్దేశంతో రాజ్‌కుమార్ వచ్చిన సంబంధాలను చెడగొట్టాడు. వయసులో తనకన్నా ఆరేళ్లు పెద్దదైన సరితను 2018లో పెళ్లి చేసుకున్నాడు. డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న రాజ్‌కుమార్.. బెట్టింగులు, జూదం వంటి వ్యసనాలకు బానిస అయ్యాడు. రెండు కోట్ల రూపాయలు అప్పులు చేశాడు. అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. చనిపోతానని బెదిరించటంతో అతడి తల్లిదండ్రులు కొంత పొలం అమ్మేసి అప్పులు తీర్చారు. ఆ తర్వాత తల్లిదండ్రులను నమ్మించి మొత్తం పొలం అమ్మేలా చేశాడు. జల్సాలకు, మద్యానికి బానిసైన రాజ్ కుమార్.. తరచూ మద్యం సేవించి సరితను వేధించేవాడు. రాజ్‌కుమార్ వేధింపులు తాళలేకపోయిన సరిత విడాకులు అడిగింది. దీంతో ఆమెపై పగ పెంచుకున్నాడు. శుక్రవారం రాత్రి సరితను, ఇద్దరు పిల్లలను హత్య చేశాడు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం చేయూత : కలెక్టర్ నారాయణరెడ్డి

షాబాద్ రాజ్‌కుమార్ హత్యాకాండ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని సహాయాలను పూర్తిస్థాయిలో అందజేస్తామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. దివ్యాంగురాలు మేఘనకు ఇప్పటికే రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించామని, ఆమెకు అవసరమైన వైద్యం, పునరావాసం, మానసిక వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రభుత్వ పునరావాస కేంద్రంలో చేర్పించి మెరుగైన సంరక్షణ అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.బాధిత కుటుంబానికి అవసరమైన ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా అందేలా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కేసులో నిందితుడికి ఎవరైనా సహకరించినట్లు విచారణలో తేలితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కూడా కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అసాంఘిక శక్తులపై నిఘా

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని సూచించారు.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు. చి, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు.. మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానిత ప్రదేశాలలో నిఘా పెట్టాలన్నారు.. మాదకద్రవ్యాలు, పేకాట, అక్రమ మద్యం రవాణా, నిల్వలు, సైబర్ నేరాలు, సంఘవిద్రోహ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు... రాత్రి వేళల్లో వాహన తనిఖీలు, బీట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ ప్రజల భద్రత కొరకు పనిచేయాలని సూచనలు అందించారు.. గ్రామ పోలీస్ అధికారులు, వికారాబాద్ సురక్ష మిత్ర వాలంటీర్ల సమన్వయంతో ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్పి పేర్కొన్నారు... వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును, వాటి ద్వారా జరుగుతున్న పర్యవేక్షణను ఎస్పి క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి, గ్రామాలు, ప్రధాన రహదారులు, కూడళ్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలను సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షి ంచాలని, నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని పోలీసులకు ఎస్పి సూచించారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ, పెండింగ్ కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఆదేశాలిచ్చారు.. విధి నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజాసేవా దృక్పథంతో ప్రతి పోలీస్ పనిచేయాలని ఆదేశించారు.

వీధి దీపాల మాటున చీకటి దందా?

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ బల్బుల ధరలు తక్కువగా ఉంటాయని, లోగడ గ్రామంలో వేసిన హైమాస్ట్ లైట్లను కూడా రిపేర్ చేయిస్తున్నామని చెప్పారు. అధికారులు కూడా తమ విధి నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావివ్వలేదని వివరణ ఇచ్చారు.

అంతా పారదర్శకమే : సహాయ ఇంజనీరు యశ్వంత్

వార్డు సభ్యురాలు, గ్రామస్తులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. గ్రామంలో 80 కొత్త బల్బుల బిగించగా వాటికే రూ.1,13 లక్షల బిల్లు చేసి ఎంబి రికార్డు చేసినట్లు ఏఈ తెలిపారు. అక్రమాలు జరిగాయనడం నిజం కాదని స్పష్టం చేశారు. ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

వికారాబాద్, ప్రభాతవార్త : చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని సంఘం లక్ష్మీ ్మబాయి బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని విద్యార్థినీలకు మాత్రల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరికి ఏడాదిలో రెండుసార్లు ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేస్తుందన్నారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆల్బెండాజోల్ మాత్రలు వేయడం వల్ల నులి పురుగులను సమర్థవంతంగా నివారించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సుధాకర్ లాల్, కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా భావాలను వ్యక్త పరచండి

ఘటకేసర్, జూలై 13, ప్రభాతవార్త: విద్యార్థులు తమ అభిప్రాయాలు, సమస్యలు, సూచనలను స్వేచ్ఛగా వ్యక్త పరచే అవకాశం కల్పిస్తామని గురుకుల ప్రిన్సిపాల్ బి.వేణుగోపాల్ అన్నారు. బాలుర సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అభిప్రాయాలు, సమస్యలు, సూచనలను నేరుగా తెలుసుకునేందుకు వాయిస్ ఫర్ చేంజ్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈమేరకు సోమవారం ఘటకేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వాయిస్ ఫర్‌చేంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాన కార్యదర్శి శారద, ఆధ్వర్యంలో నిర్వహించే ఈకార్యక్రమం ద్వారా ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్ షేక్ మహబూబ్‌బాష, ప్రాన్సిస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యలను సకాలంలో గుర్తించి పరిష్కరించడం, క్రమశిక్షణ పెంపొందించడం, జీవన నైపుణ్యాలను మెరుగు పరచడం ఈకార్యక్రమం ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. శుభ్రత, ఆరోగ్యం, భద్రతా, విద్యానాణ్యత, క్రీడలు, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు.

కాసులివ్వకపోతే కొర్రీలే!

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. రైతుల వద్ద నుండి నయాపైసా కూడా లంచం తీసుకోరాదని గట్టిగా హెచ్చరించారు. దీంతో దిగొచ్చిన విద్యుత్ అధికారులు వారం రోజుల్లో రైతుల సమస్యను పరిష్కరిస్తామని సమాధానం ఇచ్చారు.

వ్యాపార, గృహ వినియోగదారులకూ తప్పని వేధింపులు

తాండూరులో కేవలం రైతులకే కాదు, గృహ, వ్యాపార వినియోగదారులకూ ఇదే సమస్య ఎదురవుతోంది. నిబంధనల ప్రకారం చేపట్టాల్సిన పనులకు కూడా అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇటీవల గుజరాత్ వ్యాపారులు హైదరాబాద్ మార్గంలో ఒక బిల్డింగ్ నిర్మించగా, దానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు అధికారులు నానా ఇబ్బందులు పెట్టారు. మీటర్ అమర్చాలంటే ప్యానెల్ బోర్డు పెట్టుకోవాలంటూ, అందుకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని తేల్చేశారు. సదరు వ్యాపారి చేత డీడీలు కట్టించినప్పటికీ, కనెక్షన్ ఇవ్వడానికి నిరాకరించి గృహ ప్రవేశం రోజు వరకు తీవ్ర అసౌకర్యానికి గురిచేశారు. ఇలాంటి వేధింపుల వెనుక కొంతమంది ఉన్నతాధికారుల హస్తం ఉందని, కిందిస్థాయి సిబ్బందిని వాడుకుని చివరి నిమిషం వరకు ఇబ్బందులు పెడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం – ఏఈ రఘువీరారెడ్డి

మల్ రెడ్డిపల్లి రైతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. రైతుల వద్ద ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఇవ్వద్దు, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. సిబ్బంది కూడా ఎవరి వద్ద డబ్బులు తీసుకోవద్దని ఆదేశించాం.

విధుల పట్ల అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదు. గృహ వినియోగదారులు కూడా ఎవరికీ నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి సంప్రదించాలి. కొన్ని సాంకేతిక కారణాల వల్లే పనుల్లో జాప్యం జరిగింది తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు.

కిందకు వంగిపోయిన వైర్లు చూపిస్తున్న రైతు

కలెక్టరేట్ వద్ద జర్నలిస్టుల ధర్నా

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 13, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టిడబ్ల్యుజేఎఫ్ జిల్లా నాయకులు ధర్నా చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్) జిల్లా నాయకులు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వారు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి నిరసనలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్‌కె సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు మల్లేశ్‌గౌడ్, కార్యదర్శి బనావత్ రవినాయక్‌లు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికి వెంటనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీలు లభించేలా చూడాలని, అదే విధంగా ఇండ్ల స్థలాలు పట్టాలు అమలు విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేకుంటే ఆందోళనలు తీవ్రం చేస్తామని వారు హెచ్చరించారు. ఆ తరువాత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఫెడరేషన్ జిల్లా, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలలో వికారాబాద్ పోలీసుల ప్రతిభ

వికారాబాద్, ప్రభాతవార్త : జిల్లా పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారులకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకా లను, ఇటీవల నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ స్పోర్ట్స్ మీట్-2026 లో వికారాబాద్ పోలీసులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన 8 మంది పోలీస్ క్రీడాకారులను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సన్మానించి అభినందించారు. నూతన సంవత్సర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఉత్తర్వుల మేరకు జిల్లా పరిధిలో ఉత్తమ సేవలు అందించిన ఎ.శ్రవణ్ కుమార్ (ఎఎస్ఐ), జి.ప్రకాష్ (ఏఆర్ఎస్ఐ), కె. మోహన్ రాజ్ (ఏఆర్ఎస్ఐ), పి.సంజీవయ్య (ఏఆర్ఎస్ఐ), ఎస్.విఠలయ్య (ఏఆర్ఎస్ఐ) లకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను ఎస్పీ ప్రదానం చేశారు.

రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వికారాబాద్ జిల్లా పోలీస్ జట్టు 3 రజత, 5 కాంస్య పతకాలతో మొత్తం 8 పతకాలు సాధించింది. ఉమెన్ పీఎస్ ప్రవంతి (ఆర్మ్ రెజ్లింగ్-50 కేజీలు), పీసీ శివదర్శన్ (వెయిట్ లిఫ్టింగ్-60 కేజీలు), పీసీ మహేందర్ (ఆర్మ్ రెజ్లింగ్-85 కేజీలు) రజత పతకాలు సాధించగా, డబ్ల్యూపీసీ రేణుక (పుషు-60 కేజీలు), డబ్ల్యూపీసీ కవిత (బాక్సింగ్-50 కేజీలు), డబ్ల్యూపీసీ వినోద (ఆర్మ్ రెజ్లింగ్-65 కేజీలు), పీసీ ఆనంద్ (ఆర్మ్ రెజ్లింగ్-70 కేజీలు), పీసీ శ్రీనివాస్ (ఆర్మ్ రెజ్లింగ్-60 కేజీలు)లు కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఎస్పీ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సేవా పతకాలు అందుకోవడం ప్రతి పోలీస్ అధికారికి అత్యంత గౌరవప్రదమైన విషయమని అన్నారు. విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపని తెలిపారు. ఈ గుర్తింపు మరింత బాధ్యతతో ప్రజలకు సేవలందించేలా ప్రతి అధికారిని ప్రేరేపిస్తుందని అన్నారు. వికారాబాద్ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకుంటూ, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. రాబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లోనూ ఇదే స్ఫూర్తితో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షి ంచారు.

పథకాలు సాధించిన పోలీసులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా

సర్ ప్రక్రియలో స్పీడ్ పెంచండి

బిఎల్ఓలకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 13, ప్రభాతవార్త : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బిఎల్ఓలు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయటంలో, నింపిన ఫారాలను స్వీకరించటంలో వేగం పెంచాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న సర్ ప్రక్రియను జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ మనుచౌదరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్ఓలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని, సర్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పూరించిన ఫారాలను వెంట వెంటనే డిజిటలైజ్ చేయించాలని బిఎల్ఓలను కలెక్టర్ ఆదేశించారు. రోజు వారీ టార్గెట్‌లను ఏ విధంగా పూర్తి చేయాలో అవసరమైన సలహాలు సూచనలు వారికి కలెక్టర్ చేశారు. ఆ తరువాత కొంపల్లిలో నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఓటర్లతోనూ ఆయన నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి ఫారాలను ఏ విధంగా నింపాలనే దానిపై జిల్లా కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పలువురు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రతి ఒక్కరు సహకరించాలి

చౌడపూర్ జులై 13 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో తమ ఓటు కొరకు ఫారాన్ని నింపి బి.ఎల్.ఓలకు తప్పనిసరిగా అందించాలని మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.సోమవారం చౌడపూర్ మండలం, చాకల్ పల్లి గ్రామంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పరిశీలించారు.. ఫారాలను నింపేందుకు గ్రామస్థుల కు సహకరించాలని బిఎల్ఓ సుధాకర్, బిఎల్ఎ బాల్ రాజ్‌లకు సూచించారు.. రాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కుని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరు ఎస్.ఐ.ఆర్ ఫారాన్ని అందించాలని తెలిపారు.సందేహాలుంటే సంబందిత అధికారులను, బిఎల్ఓలను సంప్రదించాలని తెలిపారు..

ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

వికారాబాద్,ప్రభాతవార్త : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారుల కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలులో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు మరియు సమస్యలకు సంబంధించిన 154 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని, ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఆర్ఎ స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో 78 దరఖాస్తులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 13, ప్రభాతవార్త: జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో ఆయనతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ మాలతి, పలువురు అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో ప్రజల నుంచి 78దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై ప్రజావాణిలో పరిష్కారం కోసం ధరఖాస్తులు అందజేశారని, వాటిని సంబంధిత అధికారులు ఎలాంటి జాప్యం చేయకుండా పరిశీలించి శాఖల వారీగ అధికారులు స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో సమస్యలు పరిష్కరిస్తారని ప్రజలు భావిస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ధరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. ఏమైనా ధరఖాస్తులను తిరస్కరిస్తే వాటికి గల కారణాలను వారికి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ధరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జిల్లా సంబంధిత వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతన్న ఆకలి తీర్చడం మా అదృష్టం

వికారాబాద్, ప్రభాతవార్త : అందరికి అన్నం పెట్టి అందరి కడుపు నింపుతున్న రైతన్న ఆకలి తీర్చడం తన అదృష్టంగా భావిస్తున్నానని వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. సోమవారం వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తరపున హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు 5 రూపాయలకే భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా రూ.5 భోజనాన్ని చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ పి.మల్లేశం మార్కెట్ యార్డులో రైతులకు భోజనం వడ్డించి వారి నుండి సలహాలు సూచనలు తీసుకున్నారు.

ప్రతి సోమవారం, గురువారం రైతులకు 5 రూపాయల మధ్యాహ్న భోజన కార్యక్రమం ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. దేశ ప్రజల కడుపు నింపే రైతన్నల ఆకలి తీర్చడం వారికి సేవ చేయడం మా పాలకవర్గం అదృష్టంగా భావిస్తున్నామని, ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. త్వరలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో రైతు బజార్ బీట్లలో రైతులకు అల్పాహారం(టిఫిన్) పెట్టె కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వట్టం నర్సిములు, విజయ్ కుమార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రూ.5 భోజనాన్ని వడ్డిస్తున్న ఎఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్

ప్రాణాలైనా ఇస్తాం.. ఒప్పుకోం

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, డంపింగ్ యార్డు ఏర్పాటైతే పంట పొలాలు కాలుష్యానికి గురవుతాయని, భూగర్భ జలాలు కలుషితమై ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దాపూర్‌ను చెత్తకుప్పగా మార్చేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించం. ఇది మా భూమి.. మా భవిష్యత్తు.. చివరి శ్వాస వరకు ఈ పోరాటం కొనసాగుతుంది అని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకులు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ఏకపక్ష నిర్ణయాలతో ముందుకెళ్తే ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సిద్దాపూర్‌తో పాటు షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల మద్దతుతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.

జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా శివకుమార్

మేడ్చల్, జులై 13, ప్రభాతవార్త : మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మేడ్చల్ పట్టణానికి చెందిన కనకాల శివ కుమార్ (టీపీటీ రాజు) నియమితులయ్యారు. పార్టీ అభ్యున్నతి కోరకు శివ కుమార్ చేసిన కృషిని ఆయనను జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ప్రకటించి ఆయనకు సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. కాగా తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను న

ఇందిరమ్మ గృహప్రవేశానికి హాజరై ఆర్థిక సహాయం అందజేస్తున్న కరణం కీర్తిరామకృష్ణ దంపతులు.

మాట నిలబెట్టుకుంటున్న కోల్కుంద సర్పంచ్

మోమిన్‌పేట్, జులై 12, ప్రభాతవార్త: ఎన్నికల సమయంలో ఇచ్చినమాట మేరకు గ్రామంలో ఎలాంటి కార్యక్రమానికైనా తనవంతు ఆర్థిక సహాయం చేయడం మోమిన్‌పేట్ మండలం కోల్కుంద గ్రామ సర్పంచ్ కీర్తి రామకృష్ణ దంపతుల ప్రత్యేకత....ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యధర్శి, కోల్కుంద గ్రామ సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ గ్రామంలో ఎవరి వద్దనైనా ఎలాంటి కార్యక్రమానికైనా ఆర్థిక సహాయం చేయడం, ఆపై గ్రామాభివృద్ధికొరకు నిరంతరం కృషి చేస్తూ గ్రామస్తులందరి మన్ననలు పొందుతోంది. ఆదివారం మంగలి లక్ష్మి భర్త కీ,శే,లు లక్ష్మయ్య ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశానికి హాజరై లక్ష్మి కి 25116, రూపాయల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వరుసగా గత 4, దఫాలుగా మాఇంట్లో సర్పంచ్, ఎంపిటీసిగా ప్రస్తుతం సర్పంచ్‌గా ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన మాటమేరకు ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారం, పదవులు ఉన్నా లేకపోయినా మేమిచ్చిన మాట ప్రకారం గ్రామంలో ఎలాంటి కార్య క్రమానికైనా ఆర్థిక సహాయం అందజేయడం ఎల్లపుడు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కీర్తిరామకృష్ణ దంపతులు,సీనియర్ నాయకులు కరణం బుజంగం, గ్రామ ఉపసర్పంచ్ మహేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు ఖాసీం, స్వరూప, పెద్దలు ఖుత్బొద్దీన్, సంగమేశ్వర్, అబ్దుల్, బొబ్బిలి శివుడు, వికారాబాద్ జిల్లా సీనియర్ జర్నలిస్టు అంరాది నర్సింలు, లక్ష్మి కుటింబీకులు తదితరులు పాల్గొన్నారు.

హిల్స్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సతీశ్ నియమాకం

ఘట్‌కేసర్ రూరల్, జులై 13, ప్రభాత వార్త: పోచారం డివిజన్ ముత్వెల్లిగూడ పరిధిలోని హిల్స్‌వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎరుకల సతీశ్, ఉపాధ్యక్షుడిగా శేరీ యాదగిరి, కార్యదర్శిగా ముంతాల నితిన్ రాజ్, ఉప కార్యదర్శిగా చెన్నోజి వీరాచారి, కోశాధికారిగా రవికాంత్, సహ కోశాధికారిగా వర్కల రాజేందర్, కమిటీ సలహాదారులుగా జి. రాకేశ్, జె. ఉదయ్, కార్యవర్గ సభ్యులుగా ఏర్ర ఉపేందర్, పావన్ దేవ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కాలనీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సతీశ్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాలనీ సంక్షేమం కొరకు నిరంతరం సేవలు అందించడానికి తమ టీం సభ్యులు సిద్ధంగా ఉంటామని అన్నారు.

ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ

ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :

తెలంగాణ ఉద్యమకారుకుల గుర్తింపు ఇచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియను స్వాగతిస్తున్నామని తాండూరు టీజేఏసీ చైర్మన్ సాంబూరు సోమశేఖర్ అన్నారు. ఉద్యమ కారుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు కమిటీముందు తమ అభిప్రాయాన్ని వెల్లడిం చారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులను కలిసి వినతిపత్రం సమర్పిం చారు. తమ డిమాండ్లలో ప్రధానంగా గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇది వరకు ఇచ్చిన హామీ ప్రకారం 250 చదరపు గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని సోమశేఖర్ డిమాండ్ చేశారు. పెన్షన్, అధికారిక గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు చేయాలన్నారు. ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం, ప్రభుత్వ–ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. పోలీసు కేసులు ఎదుర్కొని, జైలు జీవితం గడిపిన వారికి, ఉద్యమం వల్ల ఆర్థికంగా నష్టపోయిన ఉద్యమకారులకు పునరావాసం, ఉపాధి, ఆర్థిక సహాయం అందజేయాలని తెలిపారు. ఉద్యమ కారుల పిల్లలకు విద్య, స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి, ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. స్థానిక పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యమకారుల పిల్లలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ గుర్తింపు ప్రక్రియ రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా, ఉద్యమంలో చేసిన సేవలు, త్యాగాలు, ఎదుర్కొన్న కష్టాలను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యానికి గురైన వికారాబాద్ జిల్లా అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురైనాయని, రాజధానికి చేరువలో ఉన్నా పలు రంగాలలో వెనకబాటుకు గురైనాయని వివరించారు.

కోదండరామ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సోమశేఖర్

ఉపాధి హామీ పేరు నిబంధనలు మార్పు

: ఎంఎపిడిఒ రాధ రాణి

యాచారం ,జులై 13 ,ప్రభాతవార్త:

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మారి వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్ ఆ జీవిక్ మిషన్ గ్రామీణ్ గా ఆవిష్కరమై 2026 జూలై 1 నుంచి అమలు అవుతుందని ఎంపీడీవో రాధారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రధాన మార్పులు ఉపాధి హామీ వంద రోజుల నుండి 125 రోజులకు పెంపొందించినట్లు తెలిపారు. రాష్ట్రాలవారీగా పెంచబడిన కనీస వేతనం 300 కంటే తక్కువ కాకుండా నిర్ణయించారు. డిజిటల్ పారదర్శకత బయోమెట్రిక్ హాజరు జియో టాకింగ్ ప్రత్యక్ష పర్యవేక్షణ వంటి విధానాలు వేతన చెల్లింపు బ్యాంక్ ఖాతాల్లో నేరుగా చేసే విధానం బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య కారణాలపై దర్యాప్తు

జవహర్‌నగర్, జులై 13,ప్రభాత వార్త:

జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అంబేద్కర్‌నగర్ బీజేఆర్ నగర్‌కు చెందిన లింగాల రాములు కుమారుడు గణేష్ (19) ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ నెల12నమధ్యాహ్నం రాములు, ఆయన భార్య స్వగ్రామమైన దూది వెంకటాపురానికి వెళ్లగా, గణేష్ ఇంట్లోనే ఉన్నాడు. కుటుంబ సభ్యులు రాత్రి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించక పోవడంతో నిద్రలో ఉన్నాడనిభావించారు.అయితే ఈ నెల 13న ఉదయం గణేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. వెంటనే ఇంటికి చేరుకున్న తండ్రిరాములు, ఇనుప పైపుకు చీరతోఉరివేసుకున్న స్థితిలో గణేష్‌ను గుర్తించాడు. అప్పటికే స్థానికులు మృతదేహాన్ని కిందకు దించినట్లు తెలిసింది.తన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియవని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి

శామీర్‌పేట, జులై 13, ప్రభాతవార్త:

శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి పర్యటించి పరిశీలించారు. సోమవారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో, తూంకుంట (పూర్వ) మున్సిపల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించి ఎస్ఐఆర్ జరుగుతున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. బిఎల్ఓలు ఓటర్లకు సహకరించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో ఉండే విధంగా చూడాలని బిఎల్ఓలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మూడుచింతల పల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, లాల్‌గడిమలక్‌పేట్ కౌన్సిలర్ సి.వనజ శ్రీనివాస్‌రెడ్డి, యాడారం కౌన్సిలర్ హనుమాన్‌దాసుగౌడ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కౌన్సిలర్ ఆర్.నీరజ్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, జులై 13, ప్రభాతవార్త: ప్రజా సంక్షేమమూ ధ్యేయంగా ప్రజాపాలను కొనసాగిస్తూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్షం అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.

కడ్తాల్ మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధికి రూ 5.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హెచ్ఎండిఏ, టీజీ యు ఐ సి మరియు ఎన్ఆర్ఆజీఎస్ నిధుల ద్వారా కడ్తాల్ మండల అభివృద్ధికి రూ 5.30 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. సోమవారము సర్పంచులు, ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి చరికొండ, ఎక్వాయిపల్లి, కడ్తాల్ గ్రామాల్లో సర్పంచులు రాయి కంటి బిక్షపతి, అద్దాల మహేందర్ గౌడ్, పాలకుర్ల కరుణాకర్ గౌడ్ తో కలిసి సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో వివిధ గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాలలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పరాదర్శకంగా నిబంధన మేరకు పూర్తి చేయాలనే సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గుడురు భాస్కర్ రెడ్డి, పీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతుగంటి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పాలకుర్ల రవికాంత్ గౌడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడండి

పూడూరులో జరిగిన మండలస్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి,తదితరులు

పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, జులై 13, ప్రభాతవార్త : ప్రభుత్వ అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.సోమవారం పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ శాఖల మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రాధాన్యతగా పరిగనించి పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను అదేశించారు.మండలంలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని పలు శాఖల అధికారులకు సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సేవలు అందేలా చూడాలన్నారు.ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న అభివృద్ధి పనులు,ప్రభుత్వ పథకాలు,ప్రజలకు అందుతున్న సేవలపై వివిధ శాఖల అధికారులతో ఆరాతీశారు.ఇందిరమ్మ ఇండ్లనిర్మానాలను త్వరితగతిన పూర్తిచేయించాలన్నారు.గ్రామాల్లో జరుగుతున్న (సర్)ఎస్ఐఆర్‌పై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మకమిటి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి,పూడూరు, పిఎసిఎస్ చైర్మన్ పట్లోళ్ల రఘునాథ్‌రెడ్డి,వైస్ చైర్మన్ సురేందర్ ముదిరాజ్,మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి,ఉపాధ్యక్షులు,స్థానిక సర్పంచ్ ఖిజర్ పాష,తహశీల్దారు విజయ్‌కుమార్, ఎంపిడిఓ పాండు,జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు ఆనందం,కంకల్ సర్పంచులు భూపతిరెడ్డి,వీరేశం,మాజీ సర్పంచులు అనంతరెడ్డి,జె రాములు, మాజీ ఎంపిటిసి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బోగారం గ్రామాన్ని కీసర డివిజన్‌లో విలీనం చేయాలని వినతి

కీసర,జులై 13,ప్రభాత వార్త:

బోగారం గ్రామాన్ని కీసర డివిజన్‌లో విలీనం చేసి గ్రామాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్‌కు వినతిపత్రం

సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బోగారం గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రజా సేవలు అందాలంటే గ్రామాన్ని కీసర డివిజన్‌లో కలపడం అవసరమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని వివరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు

తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బోగారం గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు సుంకరి జైహింద్ రెడ్డి, టీడీపీ మేడ్చల్ అసెంబ్లీ ఇన్‌చార్జి సుంకరి వెంకటేష్, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిచేలిమి కృష్ణ, రైతు బంధు కన్వీనర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పడమటి నర్సింహారెడ్డి, మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు మునిగొండ శివయ్య, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గోసుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోచారం డివిజన్ యంనంపేట్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన పార్టీ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ తదితరులు.

సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్‌దే

పోచారం డివిజన్ అధ్యక్షుడు రాజేవ్

ఘట్‌కేసర్ రూరల్, జులై 13, ప్రభాత వార్త: కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేశ్ అన్నారు. పోచారం డివిజన్ 8వ వార్డులో సోమ వారం ఇస్మాయిల్ ఖాన్‌గూడ, యంనంపేట్ గ్రామాల్లో తన పరివారంతో కలిసి పర్యటించి పార్టీ జెండాలను ఏగురవేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని అన్నారు. గ్రామీణ ప్రజలకు అనాడు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చామని నేడు తమ ప్రభుత్వ హయంలో ఇందిరమ్మ ఇండ్లు గ్రామ గ్రామాన పేదలకు నిర్మించి ఇస్తున్నామని అన్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీ, ఉచితంగా మహిళలకు బస్సు రవాణా సౌకర్యం వంటి పథకాలు చేపట్టామని అన్నారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హయంలో రాష్ట్రాభివృద్ధి శరవేగంగా జరుగుతుందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు అండగా ఉంటారని అన్నారు. అనంతరం సర్ కార్యక్రమంపై పలు వీధుల్లో తిరిగి పర్యవేక్షించారు. అర్హుడైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చూసే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని వారు ప్రజల తరపున నిలబడి పర్యవేక్షించాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల రామకృష్ణారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ ఎన్. శ్రీశైలం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏర్ర రాజు, నాయకులు బద్దం నర్సింహారెడ్డి, నర్రి మంజుల, బి. నగేశ్ గౌడ్, బి. అనిల్ గౌడ్, సగ్గు శ్రీనివాస్, బోజిరెడ్డి, పసులాది నర్సింగ్‌రావు ముదిరాజ్, కె. వినోద్, కట్టా ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి చెక్కు అందజేస్తున్న నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు .. నేర్ర శ్రీశైలం

యాచారం,జులై 13, ప్రభాతవార్త:

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నంది వనపర్తి గ్రామ శాఖ అధ్యక్షులు నేర్ర శ్రీశైలం అన్నారు. సోమవారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో పన్నీరు శ్వేత కు 32,500 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శ్రీశైలం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందజేస్తున్నారని కొనియాడారు. ఎన్నడు లేని విధంగా నంది వనపర్తి గ్రామంలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరై ఇండ్లు నిర్మాణం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మాయలోనే నిరుపేదలందరికీ సంక్షేమం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తు చేసుకున్న వెంటనే నిధులు మంజూరై ఆర్థిక సహాయం అందడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండీ బాబర్, సాజీద్, రామకృష్ణ యాదవ్, తెల్గమల్ల ప్రశాంత్, ముచ్చర్ల యాదగిరి, సామ మధు, కొండపురం శ్రీకాంత్ ఇతరులు పాల్గొన్నారు.

అందుబాటులో మెరుగైన వైద్యం

క్షేమంగా ఉన్న తల్లీబిడ్డలు, అభినందించిన గ్రామస్తులు

ధారూర్,జూలై 13, ప్రభాత వార్త: ధారూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సమయస్ఫూర్తితో ఒక గర్భిణికి సురక్షి తమైన ప్రసవం జరిగింది. సోమవారం రుద్రారం గ్రామానికి చెందిన అనూష అనే గర్భిణి తీవ్రమైన పురిటి నొప్పులతో ధారూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాగా, అక్కడి వైద్య సిబ్బంది వెంటనే స్పందించారు. వైద్యాధికారి డాక్టర్ శాంతి పర్యవేక్షణలో వైద్య బృందం అనూషకు అత్యవసర ప్రసవం చేశారు. ఈ క్రమంలో అనూష పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఇది తనకు రెండవ కాన్పు అని, ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని డాక్టర్ శాంతి వెల్లడించారు. క్లిష్ట సమయంలో సకాలంలో వైద్యం అందించి తల్లీబిడ్డలను కాపాడిన డాక్టర్ శాంతిని, సిబ్బందిని గ్రామస్తులు, రోగి కుటుంబ సభ్యులు అభినందించారు.

జాతీయ నులిపురుగుల నివారణపై విద్యార్థులకు అవగాహన

జవహర్‌నగర్,జులై 13.ప్రభాత వార్త.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జవహర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం. నరేందర్, ఉపాధ్యాయులు సునంద, సంధ్యాదేవి, వైద్య పర్యవేక్షకురాలు ఫాతిమా, ఆయా సిబ్బంది పాల్గొన్నారు ఈసందర్భంగా మాట్లాడుతూ రెండు సంవత్సరాల లోపు పిల్లలకు 200 మిల్లీగ్రాముల ఆల్బెండజోల్ మాత్రలు, రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల లోపు వారికి 400 మిల్లీగ్రాముల ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు. నులిపురుగుల నివారణకు ఈ మాత్రలు ఎంతో ఉపయోగకరమని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

అలాగే వ్యక్తిగత పరిశుభ్రత,చేతులుశుభ్రంగా కడుక్కోవడం వల్ల అనేక వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలని సూచించారు.ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బంట్వారంలో నులిపురుగుల నివారణ దినోత్సవం

బంట్వారం,ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆల్బెండజలు మాత్రలు తప్పనిసరిగా వేయాలని వైద్య సిబ్బంది సూచించారు. పిల్లలు మానసికంగా శారీరకంగా ఎదగడానికి పోషకాహార లోపం జరగకుండా ఉండడానికి ఈ మాత్రలు ఎంతగానో సహాయపడతాయని అన్నారు. భోజనం ముందు చేతుల శుభ్రంగా కడుక్కొని ఆహారం తినాలని అదేవిధంగా మరుగుదొడ్లను వాడుకొని శుభ్రంగా కడుక్కొని శుభ్రత పాటించేలా విద్యార్థులకు, చిన్న పిల్లలకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నపిల్లల విషయంలో అజాగ్రత్తగా ఉండరాదని అన్నారు.

జాతీయ నూలిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

కీసర,జులై 13, ప్రభాతవార్త:

నియామకం పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

జాతీయ నూలిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అహ్మద్‌గూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్ గౌడ్, వైద్యాధికారి డాక్టర్ వెంకన్న, ప్రధానోపాధ్యాయులు నర్సింహారావు, ఏఎన్ఎం మంగా తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండుసంవత్సరాల లోపు పిల్లలకు 200 మిల్లీగ్రాముల అల్బెండజోల్ మాత్రలు, 19 సంవత్సరాల లోపు పిల్లలకు 400 మిల్లీగ్రాముల అల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు. నూలిపురుగుల నివారణకు ఈ మాత్రలు ఎంతో ఉపయోగకరమని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ మాత్రలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం ప్రారంభం

కీసర,జులై 13, ప్రభాతవార్త:

నాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ ఆనంద్, డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ గీత, కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీదేవి, జిల్లా టీకాల అధికారి డాక్టర్ కౌశిక్, ఆరోగ్య బృందం సభ్యులు మరియు కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన వారు నులిపురుగుల నివారణలో ఆల్బెండజోల్ మాత్రల ప్రాముఖ్యతను

వివరించారు. నులిపురుగుల వల్ల పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందని, క్రమం తప్పకుండా నివారణమాత్రలు తీసుకోవడం ద్వారా వాటిని అరికట్టవచ్చని అలాగే మంచి

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం.. లోయలో పడి విష్ణువర్ధన్ దుర్మరణం

కొల్లి విష్ణువర్ధన్ ఫైల్

ధారూర్,జులై 13, ప్రభాత వార్త: మండల పరిధిలోని నాగసమందర్ గ్రామానికి చెందిన కొల్లి విష్ణువర్ధన్(18) (యువకుడు) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగసమందర్ నుండి రుద్రారం వెళ్లే మార్గంలో విష్ణువర్ధన్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఒక మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పింది. ఈ క్రమంలో అదుపు తప్పిన వాహనంతో సహా విష్ణువర్ధన్ పక్కనే ఉన్న లోయలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో విష్ణువర్ధన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై 108 అంబులెన్స్ సహాయంతో అతడిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే విష్ణువర్ధన్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న సీఐ రఘురాం, ఎస్సై సున్నం రాఘవేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘటన స్థలానికి పరిశీలిస్తున్న సిఐ రఘురాం, ఎస్సై సున్నం రాఘవేందర్

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కేశంపేట మండల లబ్ధిదారులకు అందజేసిన బిఆర్ఎస్ నాయకులు

కేశంపేట, జులై 13 ,ప్రభాతవార్త :

వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం షాద్ నగర్ నియోజకవర్గం లోని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.షాద్ నగర్ నియోజవర్గం కేశంపేట మండలంలోని దత్తాయిపల్లి గ్రామానికి చెందిన టీ తరుణ్,తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన రాజమోని అంజమ్మ ,బట్టిని యదయ్య , గోస్కే నర్సిములు కోనాయపల్లి గ్రామనికి చెందిన ఢిల్లీ లక్ష్మమ్మ , లేమమిడి గ్రామానికి చెందిన దిద్దెల శంకరమ్మ , అల్వాల్ గ్రామానికి చెందిన కుమ్మరి అంతయ్య , సంతాపూర్ గ్రామానికి చెందిన ఎద్దు ప్రణతి , తదితరులకు మంజూరైన చెక్కలను అందజేశారు.ఈ కార్యక్రమంలో లింగాంధన సర్పంచ్ నాగిళ్ళ వెంకట్,కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు,పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,తొమ్మిదిరేకుల మాజీ సర్పంచ్ బాలరాజ్ గౌడ్,లెమ్మమిడి డిప్యూటీ సర్పంచ్ ప్రమోధర్ రెడ్డి,మాజీ డిప్యూటీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ యదయ్య,బిఆర్ఎస్ నాయకులు మహేష్,యాదయ్య, షాద్ నగర్ బిఆర్ఎస్ నాయకులు దినేష్ సాగర్,కోనాయపల్లి బిఆర్ఎస్ యువ నాయకులు శశి నేత, విలేజ్ ప్రెసిడెంట్ చంద్ర శేఖర్, సంతోష్ రెడ్డి,ఎస్ మహేష్, అల్వాల్ శేఖర్, లబ్ధిదారులు తదిరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజస్తున్న బిఆర్ఎస్ నాయకులు

తెలంగాణ ఉద్యమకారులను గౌరవించాలి

ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న సోమశేఖర్.

-- ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

-- జేఏసీ తాండూరు నియోజకవర్గ కన్వీనర్ సోమశేఖర్

తాండూరు, జులై 13, ప్రభాతవార్త : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని టీజేఏసీ తాండూరు నియోజకవర్గ కన్వీనర్ సోమశేఖర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారులతో జరిగిన సమావేశంలో సోమశేఖర్‌తో పాటు తాండూరు ప్రాంతానికి చెందిన పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సమస్యలపై ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆనాడు వేలాది మంది ఉద్యమకారులు తమ విద్య, ఉద్యోగాలు, కుటుంబాలు, ఆస్తులు, స్వేచ్ఛను ఫణంగా పెట్టి ఆహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందిని.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా ఉద్యమ కారులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలలో, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ప్రత్యేక స్థానం కేటాయించాలని కోరారు.

ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులుగా ధీమ గణేష్

జిల్లెడు చౌదరిగూడ,జులై 13,(ప్రభాతవార్త): జిల్లేడు చౌదరిగూడెం మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. మండలంలోని కాస్లాబాద్ ఉప సర్పంచ్ ధీమ గణేష్‌ను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవం ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్, రాష్ట్ర కార్యదర్శి మట్ట శ్రీను ఆదేశాల మేరకు, రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు అంగోత్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో నూతన కమిటిని ఏర్పాటు చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్, జిల్లా అధ్యక్షులు అంగోత్ భాస్కర్ నాయక్ చేతుల మీదుగా ధీమ గణేషకు నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే కమిటీలో గౌరవ అధ్యక్షులుగా గాలిగూడెం గ్రామ ఉప సర్పంచ్ నిదురము బలరాం యాదవ్, ఉపాధ్యక్షులుగా వీరన్నపేట గ్రామ ఉప సర్పంచ్ పరిగి శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా వచ్చతండ గ్రామ ఉప సర్పంచ్ పాత్లవత్ కిషన్ నాయక్, కార్యదర్శిగా జిల్లేడు గ్రామ ఉప సర్పంచ్ పెద్దన్నగారి అనిత, కోశాధికారిగా ఇంద్రానగర్ గ్రామ ఉప సర్పంచ్ మంగలి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లచంపేట గ్రామ ఉప సర్పంచ్ యాస మైబును నియమించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు అంగోత్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని ఉప సర్పంచులందరి ఏకాభిప్రాయం, ఆమోదంతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎల్కిచర్ల ఉప సర్పంచ్ గుడిసె బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసుల కోసం మేడ్చల్ జిల్లాలో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు సహకరించాలని వినతి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 13, ప్రభాతవార్త

మేడ్చల్ జిల్లాలో ప్రత్యేకంగా ఎస్సీ,ఎస్టీల కేసుల కోసం కోర్టును ప్రభుత్వం ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను మేడ్చల్ జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ధన్‌రాజ్‌నాయక్ వినతిపత్రం అందజేసి కోరారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఆ కోర్టు నడుస్తుందని, దీంతో కేసులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నందున ఎస్సీ,ఎస్టీ కేసులు పరిష్కారంలో ఆలస్యం అవుతుందన్నారు. మేడ్చల్ జిల్లాలో ప్రత్యేకంగా ఎస్సీ,ఎస్టీల కోర్టును ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని ఎంపి ఈటల రాజేందర్‌ను కోరటం జరిగిందని జిల్లా ఆ కమిటీ మెంబర్ ధన్‌రాజ్‌నాయక్ తెలిపారు. అదే విధంగా జిల్లాలో బాలరక్షక్ భవన్ లేనందున మేడ్చల్ జిల్లాలో బాల రక్షక్ భవన్ కోసం ప్రత్యేక భవన నిర్మాణం చేపట్టాలని ఎంపి ఈటల రాజేందర్‌ను కోరటం జరిగిందన్నారు. దీనిలో జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ధన్‌రాజ్‌నాయక్‌తో పాటు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ బిఎన్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసిన ధన్‌రాజ్ నాయక్ దృశ్యం

..స్పందించిన ఎంపి ఈటల రాజేందర్ .. సిఎంకు వాటి కోసం ప్రతిపాదనలు

..మేడ్చల్ జిల్లాలో ఎస్సీ,ఎస్టీల కేసుల కోసం ప్రత్యేకంగా కోర్టును ఏర్పాటు చేయాలని, అదే విధంగా జిల్లాలో బాలరక్షక్ భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతూ వెంటనే సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఈటల రాజేందర్ లేఖలు ప్రతిపాదనలు చేస్తూ సహకరిస్తూ రాశారని, ఎంపి ఈటల సిఎంకు రాసిన ఆ పత్రాల గురించి మేడ్చల్ జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ధన్‌రాజ్‌నాయక్ వివరించారు.

బిగ్విజయంగా 'తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' కార్యక్రమం నిర్వహణ

కొడంగల్,జులై 13,ప్రభాతవార్త:

తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడాకారులకు శాస్త్రీయ శిక్షణ అందించేందుకు చేపట్టిన "తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్"కార్యక్రమం కొడంగల్,బొంరాస్‌పేట్ మండలాల్లో విజయవంతంగా ముగిసింది.క్రీడాల్లో నైపుణ్యం,గాయాల నివారణ,పోషకాహారం,మానసిక ఆరోగ్యం వంటి కీలక అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. గచ్చిబౌలిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా కోచ్‌లు, పీఈటీలు, క్రీడాకారులకు అత్యాధునిక శిక్షణా పద్ధతులపై రిఫ్రెషర్ కోర్సులను అందించారు.క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని క్రీడాభిమానులు ప్రశంసించారు.

అభివృద్ధి జరిగింది బిఆర్ఎస్ హయంలోనే..

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్

జిల్లెడు చౌదరిగూడ,జులై 13,(ప్రభాతవార్త): బిఆర్ఎస్ ఆహయంలోనె మండలంలో అభివృద్ధి జరిగిందని జిల్లేడు చౌదర్ గూడ మండలం బిఆర్ఎస్ అధ్యక్షులు సయ్యద్ హాఫీజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలెకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్య హయాంలో ఎన్నో అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చేసి చూపించారని అన్నారు. మండలంలో తుమ్మల పల్లి సబ్ స్టేషన్, చౌదరి గూడ సబ్ స్టేషన్, ఎదిర, పెద్ద ఎల్కిచర్ల, చౌదరిగూడలలో రైతు వేదికలు,రూ. 2.50 కోట్లతో చౌదరి గూడ లో సీసీ రోడ్ల ఏర్పాటు, గంగన్న గూడ నుండీ రావిరాల ద్వారా కాసుల బాద్ మీదుగా గుంజులపాడు వరకు బిటి రోడ్డు, ముప్టిపల్లి నుండి అయ్యవారిపల్లి వరకు బిటి రోడ్డు, తూంపల్లి నుండి రావిరాల వరకు బిటి రోడ్డు, లాల్ పాడ్ నుంచి లచ్చంపేట వరకు, అలాగే వనంపల్లి వరకు బిటి రోడ్డు,6 నూతన గ్రామ పంచాయతీల మంజూరు, చౌదర్ గూడా నుండి పద్మారం ద్వారా, వీరన్న పేట వరకు బిటి రోడ్డు, ప్రతి గ్రామములో పల్లె ప్రకృతి వనాలు, స్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందే విధంగా అభివృద్ధి పనులు చేసినట్లు ఆయన వివరించారు. మాజీ ఎమ్మెల్యే ప్రజల మధ్యన ఉంటూ చౌదరి గూడ మండలమును అభివృద్ధి చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇతరులపై బురద జల్లడం మానుకుని మండలాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ విలెకరుల సమావేశంలో జెబ్బర్, పడకటి వేంకటేష్, మనయ్యా , మాజీ ఎంపీటీసీ సత్య ప్రమోద్ రావు , రాములు, అక్రమ్, ఉప సర్పంచ్ గణేష్, దామోదర్ రెడ్డి, ఏదిరా నర్సింలు ,జీవరాజ్ .నర్సింలు .గోపాల్,గొల్ల శ్రీను, నరేష్ గౌడ్ ,వెంకటేష్ యాదవ్, అసిఫ్, లక్ష్మయ, శేఖర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

-- ముగ్గురిపై కేసు నమోదు

-- అక్రమ ఇసుక తవ్వకాలపై ప్రత్యేక నిఘా

బషీరాబాద్,జులై 12,ప్రభాతవార్త: బషీరాబాద్ మండల పరిధిలోని ఎక్మాయి వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను బషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు.ఎస్ఐ విఠల్ తెలిపినవివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న దేవనూర్ వెంకటప్ప ట్రాక్టర్ నెంబర్ టిజి34ఎ2337,తుప్పుడు శ్రీనివాస్‌కు చెందిన ట్రాక్టర్ టిజి34బి3245, సందపురం నర్సిములుకు చెందిన ట్రాక్టర్ నెంబర్ టిజి34ఎ8681 గల ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.అక్రమ ఇసుక రవాణా,తవ్వకాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు

అర్హులైన ప్రతిచిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు అందించాలి

రంగారెడ్డి అర్బన్,జులై 13,ప్రభాతవార్త: చిన్నారుల్లో నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనత,పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించి,వారి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి పేర్కొన్నారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (ఎన్‌డీడీ) సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నం మండలం నల్లకంచె గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల ప్రభావం వల్ల పిల్లల్లో పోషకాహార లోపం,రక్తహీనత, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని చెప్పారు.ప్రతి అర్హత కలిగిన చిన్నారికి నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా వైద్య,విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా సమర్థవంతంగా నిర్వహించి లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు.జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.స్వర్ణ కుమారి మాట్లాడుతూ విద్యాశాఖ,మహిళా,శిశు సంక్షేమ శాఖల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు,జూనియర్ కళాశాలలు,అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల అర్హులైన బాల బాలికలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.షీబా,ఉప జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డా.సత్యరత్న మాట్లాడుతూ జిల్లాలో అన్ని విద్యా సంస్థలు,అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.కార్యక్రమంలో వైద్య అధికారులు, ఉపాధ్యాయులు,ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేస్తున్న అదనపు కలెక్టర్

విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

-డ్రైవర్ల,యజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఆర్‌జిఐఏ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రమోద్ కుమార్ హెచ్చరిక

శంషాబాద్ జులై 13, ప్రభాతవార్త :

పాఠశాలలకు చెందిన బస్సుల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని ఆర్‌జిఐఏ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం ఆర్‌జిఐఎ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలను ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం అందుబాటులో ఉందా లేదా.భద్రతా ఏర్పాట్లు తగిన విధంగా ఉన్నాయా ,పాఠశాల బస్సుల పార్కింగ్ ఏర్పాటు పాఠశాల ఆవరణలోనే ఉందా ,పాఠశాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తదితర తనిఖీ చేసి యాజమాన్యాలతో డ్రైవర్ల పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ...యాజమాన్యం నైపుణ్యం కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. పిల్లలు ఎక్కే సమయం, దించేటప్పుడు నిర్దేశించిన ప్రదేశాల్లో బస్సులను నిలపాలని అన్నారు. డ్రైవర్లు ఓవర్ టేకింగ్, మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రైవర్లు ఏ తప్పు చేసినా స్కూల్ యాజమాన్యాలదే బాధ్యతన్నారు. విద్యార్థులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు పంపే విధంగా డ్రైవర్లు కృషి చేయాలని ట్రాఫిక్ నిబంధనలు పట్ల నిర్లక్ష్యం వహిస్తే యజమాన్యాలు,డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలలో తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కరుణించవయ్యా వరుణ దేవా

వరుణ దేవా కరుణించు వర్షాలు కురిపించు అంటూ కాకునూరులో గ్రామస్తుల పూజలు.

-వర్షాల కోసం కాకునూరులో గ్రామస్తుల ప్రార్థనలు

కేశంపేట, జులై 13, ప్రభాతవార్త :

కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామస్తులు సంప్రదాయ ఆచారమైన కప్పనాటకు పనుపు, కుంకుమ చల్లిస్తూ గ్రామంలోని ఇల్లు ఇల్లు తిరుగుతూ వర్షాలు కురవాలని వరుణ దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, రైతులు కలిసి కప్పను అలంకరించి గ్రామ ప్రధాన వీధుల గుండా ఇంటింటా తిరుగుతూ వాన పాటలు పాడారు. మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతులకష్టాలు తొలగాలని వరుణదేవుడిని ప్రార్థించారు. గ్రామస్తులు ఇంటి ముందు నీళ్లు పోసి, బియ్యం, ధాన్యాన్ని సమర్పిస్తూ ఈ సంప్రదాయంలో పాల్గొన్నారు. వర్షాలు కురవని సంవత్సరంలో ఇలాంటి కార్యక్రమాలు చేస్తే ఖచ్చితంగా వర్షాలు కురుస్తాయని ఇది తంతరాలుగా కొనసాగుతున్న ఆచారమని తెలిపారు.

మహిళలు, రైతులు యువకులు కలిసి కప్పను కావిడిలో ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా వరుణదేవుడిని ప్రార్థిస్తు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఇళ్ళవద్ద నీళ్ళు పోసి బియ్యం, ధాన్యం అందిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పటికి వర్షాలు లేక పంటల సాగు ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తంచేవారు. త్వరలోనే మంచి వర్షాలు కురిసి రైతాంగాం సుభిక్షంగా ఉండాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

వర్షాల కోసం జనగాంలో కప్పకావిడి

పెద్దేముల్, జులై 13, ప్రభాతవార్త: వర్షాలు కురవక తీవ్ర ఎండలతో ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వరుణదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని కోరుతూ పెద్దేముల్ మండలం జనగాంలో సంప్రదాయ పద్ధతిలో కప్పకావిడి నిర్వహించారు. గ్రామంలోని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. మంగళ హారతులతో ముగిసిన ఈ వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. శ్రీరామనగర ప్రాంగణమంతా రామానుజ కీర్తనలతో, వేద మంత్రాలతో మారుమోగింది.

ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లిన ముచ్చింతల్ సమతామూర్తి కేంద్రం

స్వామివారికి హారతి ఇస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి

- వైభవంగా రామానుజాచార్యుల ఆరుద్ర నక్షత్ర తిరుమంజన

శంషాబాద్ జులై 13, ప్రభాతవార్త :

శంషాబాద్ ముచ్చింతల్ శ్రీరామనగరంలోని సమతామూర్తి కేంద్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. భగవద్రామానుజాచార్య స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం స్వామివారికి విశేష తిరుమంజన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు.త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారి దివ్య పర్యవేక్షణలో ఈ వేడుకలు శాస్త్రోక్తంగా సాగాయి. ఉదయం 07:30 గంటల నుండి ప్రారంభమైన ఈ అభిషేక కార్యక్రమంలో అహోబిల జీయర్ స్వామిజీ మరియు సమతామూర్తి ప్రధాన అర్చకులు రఘుదత్తచార్య స్వామివారు మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిపించారు.ఆరుద్ర నక్షత్ర విశేష అభిషేకంలో భాగంగా ఉత్సవమూర్తికి పాలు, పెరుగు, తేనె, పసుపు మరియు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అర్చక స్వాములు తిరుమంజనం (అభిషేకం) చేశారు. అనంతరం స్వర్ణ రామానుజ మూర్తిని

సిపిఎస్ రద్దుకోసం ఉద్యమ బాట

దౌల్తాబాద్,జులై 13,ప్రభాతవార్త:

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా ఆగస్టు 23న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు తెలిపారు.సోమవారం రోజు దౌల్తాబాద్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సభకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆయుబ్ పాషా మాట్లాడుతూ.. .ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న కొడంగల్,తాండూరులలో,20న పరిగి,వికారాబాద్‌లలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాలకు, హైదరాబాద్ సభకు ఉద్యోగ,ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీహరిరెడ్డి,కాట్రావత్ రమేష్‌నాయక్,సిద్దు,మల్లేష్,గోవింద్,జలంధర్ రెడ్డి,తదితర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కొందుర్గులో పోలీస్ స్టేషన్లో సిద్దాపూర్ ఆందోళనకారులు!

కొందుర్గు జూలై 13 ప్రభాతవార్త: సిద్దాపూర్ లో డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని ధర్నాలో ఉన్న ఆందోళనకారులను పోలీసులు కొందుర్గు పోలీస్ స్టేషన్ కు తరలించారు. కొందుర్గుకు తరలించిన వారిలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబాయ్‌తోపాటు సిపిఐ,సిపిఎం టిఆర్ఎస్, ఎల్ హెచ్ పి ఎస్ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు ఉన్నారు. కొత్తూరు మండలం సిద్దాపూర్ లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ వద్దు అంటూ సోమవారం నాడు అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేస్తుండగా, పోలీసులు ఆందోళనకారులను డి. సి.ఎం.లో బలవంతంగా కొందుర్గుకు తరలించారు. ధర్నా సమయం ముగిసిన తరువాత సాయం త్రం అందరిని వదిలిపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హైదరాబాద్ దూరంలో ఉన్న అటవి ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కి అందే బాబయ్య విజ్ఞప్తి చేశా రు.

స్వయం సహాయక సంఘ భవన నిర్మాణ పనులను నిలిపివేయాలి

పెద్దేముల్, జులై 13, ప్రభాతవార్త: పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామ శివారులోని ఊర చెరువు శిఖం భూమిలో నిర్మిస్తున్న స్వయం సహాయక భవన నిర్మాణ పనులను నిలిపివేయాలని గ్రామానికి చెందిన మాజీ యంపిటిసి తిప్పన్న చారీ, మాజీ సర్ప